


రైల్వే స్టేషన్ కోలాహలంగా వుంది. పరిగెడుతూ వచ్చి కదలడానికి సిద్ధంగా వున్న రైలు ఎక్కాను. నా నెంబరు వెతుక్కొని సీటుని సమీపించేను. డామిట్! నేనసహ్యించుకునే సింగిల్ సీట్. లేకపోతే ఫ్లయిట్‌లో వెళ్ళాల్సిన నేను తప్పని సరి పరిస్థితుల్లో యిలా ట్రైన్ ఎక్కాలసి రావటం అదీ కనీసం ఫస్ట్ క్లాసైనా కాకపోవటం ఓహ్! హెల్!

ఈ రైలు యింకా కదలదేం? సంగీతాపిక్చర్స్ వాళ్ళ యూనిట్ అంతా ఈ పాటికి వాల్తేరు చేరుకుని వుంటారు. నాకోసం ఎదురు చూస్తుంటారేమో. అసలే ఆ ప్రొడ్యూసర్‌కి ముక్కు మీద కోపం. ఏం ఎగురుతున్నాడో! కానీ మనిషి మంచివాడు. నా నవల సినిమాగా తీసి నప్పుడు నేను పెట్టిన కండిషన్లన్నిటికీ ఒప్పుకున్నాడు. ముఖ్యంగా పాత్రలు, నవలలో ఏ మార్పూ చెయ్యకూడదన్నది. ఆ సినిమా సూపర్ హిట్ కావటంతో తన నెక్స్ట్ పిక్చర్‌కి కూడా నా నవలే తీసుకున్నాడు. సంభాషణలు కూడా నన్నే రాయమన్నాడు. ఇప్పుడా పని మీదే అర్జంట్‌గా వాల్తేర వలసి వచ్చింది. రేపటివేళకి ఇక్కడికి తిరిగి చేరుకోగలనో లేదో! సాహితీ సమాఖ్య వారి సభకి అధ్యక్షత వహిస్తానని మాటిచ్చేను.

రైలు మెల్లిగా కదలి స్పీడందుకుంది. సీట్లో సర్దుకుని కూచుంటూ అప్పుడు గమనించేను ఎదుటి సీట్లోని అమ్మాయిని. పరిశీలనగా చూశాను. చాలా మామూలు అమ్మాయి. నీలి రంగు కాటన్ చీరలో

సంపూర్ణంగా వుంది. ఏదో పుస్తకంలో పూర్తిగా మునిగి పోయి పరిసరాలను కూడా మర్చిపోయి నట్టుంది. దృష్టి మరల్చి కంపార్ట్ మెంటంతా పరికించాను చాలా మటుకు పంజాబీలు కన్పించారు బహుశా ఏదో సౌత్ యిండియా టూర్ వేసుకున్నట్టున్నారు. తిరిగి నా చూపులు ఎదుటి అమ్మాయిపై పడ్డాయి. ఇంకా అలాగే పుస్తకం చదువుతోంది. అంత దీక్షగా చదువుతున్న పుస్తక మేమిటా అని చూశాను. ఫెమీనా! పక్కనే బ్యాగు లోంచి తొంగి చూస్తున్న ఇంకో పుస్తకం కన్పించింది. పరీక్షగా చూశాను. అది నా నవలే, అయితే తెలుగమ్మాయే నన్న మాట. సాధారణంగా ఆ వయసు అమ్మాయి అందరికీ నేనే అభిమాన రచయితను. అభిమాన రచయిత ఏమిటి ఆరాధ్య రచయితని కూడా! నా అభిమానుల్లో ఎక్కువ శాతం కాలేజీ అమ్మాయిలూ, అబ్బాయిలే, యువతరం రచయిత నన్న బిరుదు కూడా నాకుంది. ఈ అమ్మాయి తలెత్తి ఒక సారి చూస్తే బాగుండును. (నా ఫోటో అన్ని మాగజైన్స్‌లో తరుచూ ప్రచురింప బడుతూనే వుంటుంది. కాబట్టి గుర్తించదేమోనన్న సందేహం లేదు.) ఎదురుగా వున్నది ప్రఖ్యాత రచయిత మధు అని తెలుసుకున్నప్పుడు ఈమె భావాలెలా వుంటాయి? ఆశ్చర్యంతో ఉక్కిరి బిక్కిర వుతుందేమో!

కానీ ఎంతసేపైనా ఆమె తన పుస్తక పఠనం ముగించేటట్టు కన్పించ లేదు. ఆమె దృష్టిని మళ్ళించేందుకు చిన్నగా పొడి దగ్గు దగ్గాను. తలెత్తి చూసిందామె చిన్నగా నవ్వి అన్నాను. "హలో, నా పేరు మధు వాల్తేరు దాకా వెళ్తున్నా. మీ రెందాకా?" "నేనూ అక్కడి కే." క్లుప్తంగా జవాబిచ్చి తిరిగి పుస్తకంలో తల దూర్చిందామె.

నన్ను గుర్తించినట్టు ఎక్కడా కన్పించ లేదు. కనీసం మాట్లాడ్డానికి కూడా ఇంట్రెస్టు చూపటం లేదు. ఐనా ఈ అమ్మాయి గుర్తు పట్టాలని తనకెందుకీ తాపత్రయం? తనకి అభిమానులంటే కొదవా? లేదే! ఎంతో మంది అందమైన అమ్మాయిలు, తను ఒక్క మాట మాట్లాడితే చాలని పొంగి పోయే వాళ్ళు, తన కోసం ప్రాణాలైనా యిచ్చే వాళ్ళు వున్నారు. ఆఫ్టరాల్, ఈ అమ్మాయి, ఈ మామూలు అమ్మాయి తనని గుర్తించక పోతే తన ప్రతిష్ఠకేమిటి లోటు? కానీ... ఈమె కళ్ళల్లో నా పట్ల ఆరాధన, మెచ్చికోలు చూడక పోతే తనలోని రచయిత 'యిగో' తృప్తి పడేట్టు లేదు. ఆ పట్టుదల తోనే సంభాషణ కొన సాగించేను,

మీ పేరు తెలుసుకోవచ్చా? ఈ సారి ఆమె కొంచెం విసుగ్గానే తలెత్తింది. నా పేరు శైలజ. యూనివర్సిటీలో ఎమ్. ఎస్సి లో జాయిన్ కావటానికి వెళ్తున్నాను. సబ్జెక్టు జెనటిక్స్. గబగబా చెప్పటం ముగించి, చాలా? ఇంకేమైనా చెప్పాలా? అన్నట్టుగా చూసింది. నా గురించేమీ అడగదేం? నా అంతట నేనే రచయితనని చెప్పుకోవటం ఎలా? ఒక ఐడియా వచ్చింది. బాగ్ తెరచి. ఇంకా మార్కెట్లోకి రాని నా కొత్త నవల ఒకటి తీశాను. ఇది సీరియల్‌గా సంచలనం సృష్టిస్తోంది. పబ్లిషర్ ముందుగా నాకొక కాపీ పంపాడు ఈ పుస్తకం చూస్తె ఆమె [illegible] సీరియస్‌గా చదు

వుకున్నట్టుగా నటించటం మొదలెట్టాను. కాని డామ్‌డేవ్స్ట్. శైలజ నా పుస్తకం వైపన్నా చూడలేదు ఎంత సేపటికీ. ఇక లాభం లేదు. డైరక్టుగా చెప్పేయ్యాలని నిశ్చయించుకున్నాను. "మీరు పుస్తకాలు ఎక్కువగా చదువుతారనుకుంటాను?" అడిగాను సంభాషణ మళ్ళీ మొదలు పెడుతూ. ఈ సారామె మొఖంలో కొంచెం ఉత్సాహం కన్పించింది. "అవునండి. పుస్తకాలు చదవడం నా ముఖ్యమైన హాబీ, కన్పడిన ఏ పుస్తకమూ వదలను." "మీ అభిమాన రచయిత ఎవరు?" ఉత్కంఠతో అడిగాను. ఆమె "మధు" అంటుందనీ, "ఆ మధు మీ ఎదురుగానే వున్నాడు" అని చెప్పగానే ఆమె ముఖంలో మారే భావాలని చూద్దామని ఆశ పడ్డ నాకు నిరాశ మిగిలింది. "యిర్వింగ్ వాలెస్! కళ్ళు మెరుస్తుండగా అందామె." ఎంత గొప్పగా రాస్తాడండీ ఆయన. ఆయన ప్రతీ నవలా అద్భుతం చదువుతుంటె ఆ సంఘటనలన్నీ నిజంగా జరిగినవేనేమో అన్పిస్తాయి తప్ప ఫిక్షన్ అన్పించవు. ఆయనకి సాటి వచ్చే రచయితలే లేరు నాదృష్టిలో. ఆయన లేటస్ట్ నావల్ మీరు చదివారా? అంటూలో... ఆమె యింకా ఏదో చెప్పుకు పోతుంది. నాకు ఒళ్ళు మండి పోతోంది. డామిట్! యిప్పటి అమ్మాయిలకి యింగ్లీషు నవల్ల గురించీ, రచయితల గురించి మాట్లాడ్డం ఫాషనై పోతోంది. తేనెలూరే తెలుగుండగా ఈ యింగ్లీషు పిచ్చేమిటి? పళ్ళ బిగువున ఓర్పుగా ఆమె ఉపన్యాసం కాస్సేపు వినిఅడిగేను. "తెలుగులో మీ అభిమాన రచయిత ఎవరు?" అని ఆ అమ్మాయి ముఖ కవళికలు ఒకసారిమారి పోయాయి. సారి అండీ, నాకు...నాకు తెలుగు చదవటం రాయటం రాదు. కేవలం మాట్లాడ గలనంతే. మా నాన్నగారి ఉద్యోగ రీత్యా చిన్నప్పట్నించీ కలకత్తా లోనే పెరిగాను. అమ్మ బెంగాలీ, డిగ్రీ కలకత్తాలోనే కంప్లీట్ చేసి పోస్ట్ గ్రాడ్యుయేషన్‌కి వాల్తేరులో సీటొస్తే వెళుతున్నాను. నేను ఒక్కసారి నీరుగారిపోయాను. అయ్యో! ఇంత సేపట్నించీ పడ్డ శ్రమంతా వృధా అయిందే. సడెన్ గా నా చూపులు ఆమె బాగ్‌లో వున్న నా నవల పై పడ్డాయి. మీకు తెలుగు చదవటం రాదన్నారు. మరి ఈపుస్తకం?" సందేహంగా అడిగాను. ఆమె తేలిగ్గా నవ్వేసి "ఓ అదా! నా ఫ్రెండ్‌కి ఈ పుస్తకం వాల్తేరులో దొరకలేదుట, కొని తెమ్మని లెటరు వ్రాస్తే తీసుకెళుతున్నాను. అయినా ఈ పుస్తకాల్లో ఏముంటాయి? యిర్వింగ్ వాలెస్ నవలలు ఒక్కసారి చదివి చూడమనీ ఎన్నో సార్లు చెప్పానుదానికి. వినదే మొండి ఘటం." ఈ మాటలు విన్నాక ఆ పుస్తకం నేనే రాశానని చెప్పాలన్పించలేదు. "మీరు కూడా నావెల్స్ చదువు తారా?" కుతూహలంగా అడిగిందామె. చదవడం కన్నా ఎక్కువగా రాస్తాను, నీరసంగా చెప్పాను. ఓ! మీరు రైటరన్నమాట? మీపేరు? "మధు" నిర్లిప్తంగా చెప్పాను. "మధు...నేనెప్పుడూ విన్న జ్ఞాపకం లేదు. వాల్తేరులో మా ఫ్రెండ్స్‌కి తెలుస్తుందనుకుంటాను. మీరెన్ని పుస్తకాలు రాశారు?" 'ఒక్కటే' కసిగా అన్నాను. పరిచయమైన ప్రతి వారి పొగడ్తలనూ, అభిమానాన్నీ అందుకున్న నాకు ఉక్రోషం వస్తోంది. 'ఒక్కటేనా! యిర్వింగ్ వాలెస్ చాలా రాశాడు.

అసలు అతను ఏదైనా పుస్తకం మొదలు పెట్టేముందు ఆ సబ్జెక్టు గురించి ఎన్నో ఏళ్ళు పరిశోధన చేసి గానీ రాయడట... మళ్ళీ ఉపన్యాసం మొదలు. ఈవిడకి ఇర్వింగ్ వాలెస్ పేరెత్తితే లోకం తెలియదు కాబోలు. ఏదో చెప్పి చెప్పి అలసి ఆపే, సగం విని, విసుగ్గా నేను. మాకు తెలియకుండానే నిద్రలోకి జారుకున్నాం.

తిరిగి మెలకువ వచ్చేసరికి రైలు వాల్తేరు స్టేషన్లో ఆగి వుంది. ఆదరా బాదరా లేచి సామాన్లు సర్దడం మొదలు పెట్టాను. ఎదుటి సీటమ్మాయి అప్పుడే దిగి పోయి నట్టుంది. పరచిన బెడ్ షీట్ మడత బెట్టబోతూ ఆగాను. బెడ్‌షీట్ క్రింద కొంత డబ్బూ, ఒక కాగితమూ కన్పించాయి. ఆత్రంగా చదవడం ప్రారంభించాను:

మాస్టారూ.

నా అక్షరాలు మీరు చదవబోతారనుకుంటేనే ఏదో థ్రిల్, చేతులు వణుకుతున్నాయి. నేను మీ అభిమానిని. పిచ్చిగా ఆరాధించే అభిమానిని. కానీ మీ కెప్పుడో ఉత్తరం వ్రాయటానికి ప్రయత్నించ లేదు. అర్హత నాకు లేదనుకునే దాన్ని.

మీరు యిప్పుడింత పాపులర్ కాక ముందు అంటే నాటకాలూ. చిన్న కథలూ రాసేటప్పుడే మీలో గొప్పతనాన్ని గుర్తించాను. మీరు ఎప్పటికైనా గొప్ప పేరు తెచ్చుకుంటారని వూహిస్తుండేదాన్ని. ఎక్కడ మీ కథ కన్పించినా కట్ చేసి దాచేదాన్ని. నేనూహించినట్లే మీరు గొప్పవారయ్యారు. పేరు తెచ్చుకున్నారు. నాలాంటి అభిమానులు మీకిప్పుడు లక్షలమంది. కానీ ఎందుకో నేను వాళ్ళందరి కన్నా మీకు దగ్గర దాన్ననిపించింది. (బహుశా అందరూ నాలాగే అనుకోవచ్చు) మీరు ఒక్కొక్క మెట్టూ పైకి వెళుతూంటే ఆ విజయాలన్నీ నావే అన్పిస్తాయి. మిమ్మల్ని ఒక్కసారి చూడాలనుకునేదాన్ని. ఒక్కసారి మా ఊళ్ళో మీకు జరిగిన సన్మాన సభలో మీ ఆటోగ్రాఫ్ ఎలాగైనా సంపాదించాలని విశ్వ ప్రయత్నం చేశాను. కానీ ఆ జనంలో మిమ్మల్ని సమీపించడానికే వీలుగాలేదు. కనీసం మిమ్మల్ని దూరం నుంచైనా కళ్ళారా చూడలేక పోయాను.

నిన్న రాత్రి ప్లాట్ ఫామ్ మీద పచారు చేస్తూ వస్తున్న మిమ్మల్ని కిటికీ నుంచి చూశాను. కలో నిజమో అర్థం కాలేదు. మీరు నేనున్న కంపార్ట్ మెంట్ లోకే ఎక్కేసరికి ఆశ్చర్యంతో తల మునకలయ్యాను. ఇక మీరు సరాసరి ఎదుటి సీట్లో కూర్చోగానే ఆనందంతో నా గుండె ఆగినంత పనయ్యింది. ఏం చెయ్యాలి? నా ఎదుట వున్నది ఎప్పుడూ నా వూహల్లో వుండే వ్యక్తి. ఏం మాట్లాడాలి? పుస్తకం చదువుతున్నట్టు నటిస్తూ ఆలోచించాను. మాస్టారూ! నేను బాగా మామూలు అమ్మాయినండీ. అపూర్వమైన అందమూ, అఖండమైన తెలివి తేటలూ, యివేవీ లేవు మీ నుంచి గుర్తింపు పొందడానికి. మిమ్మల్ని చూడగానే, "నమస్కారం సార్! నేను మీ అభిమానిని. మీ రచనలంటే ప్రాణం. మీ నవలలన్నీ చదివాను." ఈ రకంగా అన్నాననే అనుకోండి. ఆ మాటలు యింతకు ముందు ఎంతో మంది నోట విన్న మీకు చాలా మామూలుగా అన్పించవచ్చు. అందుకే నా ప్రత్యేకత తెలియ బర్చడానికే చిన్న

అబద్ధం ఆడేసు. నేను కలకత్తాలో చదివిన మాట నిజమే కానీ తెలుగు చదవడం రావనటం మాత్రం అబద్ధం అమ్మ బెంగాలీయే కానీ తెలుగులో కవితలు రాస్తుంటుంది. మా యింట్లో అందరం సాహిత్య పిపాసకులం. తెలుగులో యిప్పటి దాకా ప్రచురింప బడిన పుస్తకాలన్నీ మా యింటి లైబ్రరీలో వున్నాయి.

నేనాడిన అబద్ధానికి నన్ను దయచేసి క్షమించండి. అన్నట్టు నా పేరు కూడా శైలజ కాదు. మీ కథలో శైలజ పేరు తరుచూ కన్పిస్తుంటుంది. అందుకని అలా చెప్పాను. దీనికీ క్షమించండి. యిక పోతే మీ దగ్గరున్న మీ కొత్త నవల తీసుకుంటున్నాను. ఎన్నాళ్ళనించో ఆ నవల కోసం ఎదురు చూస్తున్నాను. అదీ గాక ఆ పుస్తకం మీద మీ స్వహస్తాలతో మీ పేరు రాసుకున్నారు కదూ? మీఆటోగ్రాఫ్ యింత తేలిగ్గా దొరుకుతుంటే ఎలా వొదులు కోవటం? దీనికి క్షమించరి య్యండేం! పుస్తకం ధర వుంచి వెళుతున్నాను.

ఇంకోమాట! ఇర్వింగ్ వాలెస్ కన్నా నా దృష్టిలో మీరే గొప్పవారు. ఎందుకంటే మీకు కావాలనుకుంటే యింగ్లీష్‌లో అతనంత గొప్పగానూ రాయగలరు గానీ మీలా అతను తెలుగులో రాయలేడు కదా?

ఇంక వుంటాను. ఇప్పటికైనా ఈ అబిమాని మీకు గుర్తుంటుంది కదూ?

ఇట్లు
ప్రీతి

సిల్లీ గర్ల్! ఉత్తరం మడుస్తూ నవ్వుకున్నాను. తనకి తెలుగు చదవడం రాదన్నది అబద్ధమని ముందే గ్రహించాను కాకపోతే ఏ ఉద్దేశంతో అబద్ధమాడుతోందో మాత్రం తెలియ లేదు. ఇప్పుడర్థమైంది.

